Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్


IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 160 | బుధవారం 26వ నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

## శతాబ్దాల గాయాలు మానిపోయాయి



**అయోధ్య , సూర్య వాస్తవం**

అయోధ్యలో నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బాలరాముడి ఆలయ శిఖరంపై కాషాయ జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ముందుగా జైశ్రీరామ్ అని నినదించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. కోట్లాది మంది కల సాకారమైందన్నారు. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించిందన్నారు. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైందన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నానన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని తెలిపారు. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం అని అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక అని అన్నారు. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుందని, స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుందని, కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోడీ అన్నారు. పేదలు, దు:ఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగాడో అయోధ్య చెబుతుందన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు అని చెప్పాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది అని ప్రధాని తెలిపారు. మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారని, రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారనీ, అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు అని సూచించారు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడని అన్నారు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు అని, ఇది మన డీఎన్ఏలోనే ఉంది అని మోడీ అన్నారు. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉందని చెప్పారు. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోందన్నారు. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలని, మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుంది అని మోడీ ఆకాంక్షించారు.

## ఏపీలో మూడు
# కొత్త జిల్లాలు

- ఐదు కొత్త రెవెన్యూ డివిజన్‌లు
- పోలవరం, మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటుకు గ్రీన్‌సిగల్
- రెవెన్యూ డివిజన్లుగా నక్కపల్లి, అద్దంకి, పీలేరు, బనగానపల్లి, మడకశిర
- ప్రకాశం జిల్లాలోకి కందుకూరు, అద్దంకి
- సబ్ కమిటీ భేటీలో సిఎం ఆమోదం
- నెలాఖరులో నోటిఫికేషన్



**అమరావతి సూర్య వాస్తవం:** రాష్ట్రంలో మరో మూడు జిల్లాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై ఈ సమావేశంలో సిఎం తొలుత సమీక్ష నిర్వహించారు. అనంతరం కొన్ని మార్పులు చేర్పులతో ఆమోదాన్ని తెలిపారు. పోలవరం, మార్కాపురం, మదనపల్లె జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 26 జిల్లాలుండగా, నూతన జిల్లాలతో కలుపుకుని జిల్లాల సంఖ్య 29కి పెరగనుంది. గిరిజనులు అత్యధికంగా ఉన్న ప్రాంతాన్ని ఓ జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్లు ఎక్కువగా రావడంతో వారి వినతులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. జిల్లాల పునర్విభజనకు సంబంధించిన మార్పులు, చేర్పులు, సర్దుబాట్లకు సంబంధించిన నిర్ణయాలను త్వరలో జరుగనున్న కేబినెట్ భేటీలో చర్చించిన అనంతరం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. కొత్త జిల్లాలతోపాటు నూతనంగా 5 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసేందుకు కూడా ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో

2లో

## పరకామణి చోరీ కేసులో భూమనను విచారించిన సీఐడీ



తిరుపతి, సూర్యవాస్తవం: పరకామణి చోరీ కేసులో టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని సిఐడి అధికారులు విచారించారు. పరకామణి కేసులో విచారణకు రావాలని మంగళవారం ఉదయం ఆయన ఇంటికి సిఐడి అధికారులు వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సాయంత్రం తిరుపతి పద్మావతి అతిథి గృహంలోని తాత్కాలిక సిఐడి కార్యాలయానికి వచ్చిన ఆయనను దాదాపు 25 నిమిషాలపాటు అధికారులు విచారించారు. పరకామణిలో 920 అమెరికన్ డాలర్లు చోరీ చేస్తూ పట్టుబడిన ఉద్యోగి రవికుమార్‌పై 2023 ఏప్రిల్ 27న కేసు నమోదైంది. అప్పట్లో టిటిడి ఎవిఎస్‌ఒగా ఉన్న సతీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్లో పోలీసు కేసు నమోదైంది. ఆ కేసుకు సంబంధించి లోక్‌అదాలత్‌లో రాజీ కుదిరినప్పుడు భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి చైర్మన్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను విచారణ కోసం సిఐడి అధికారులు పిలిచారు.

**ఈ కేసుతో నాకు సంబంధం లేదు : కరుణాకర్‌రెడ్డి**

పరకామణి దొంగతనం కేసులో సిఐడి విచారణకు హాజరైన భూమన కరుణాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనకూ ఈ కేసుతో ఎలాంటి సంబంధమూ లేదని చెప్పారు. తనను కావాలనే ఈ కేసులో ఇరికించడానికి దుష్టచతుష్టయం మంత్రి

2లో

## వైభవంగా పంచమి తీర్థం



2లో

## త్వరలో పోలీస్ స్టేషన్లకు కొత్త వాహనాలు
### : హోంమంత్రి అనిత



**అమరావతి, సూర్య వాస్తవం:** శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాంతి భద్రతలు, నేర నియంత్రణ, టెక్నాలజీ వినియోగం, పోలీస్ విభాగానికి అవసరమైన వనరులపై మంగళవారం సచివాలయంలో పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. నేర నియంత్రణకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వసతుల విషయంలో ప్రభుత్వం రాజీపడదని తెలిపారు. త్వరలో అన్ని పోలీస్ స్టేషన్లకు కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్, స్పెషల్ సెక్రటరీ విజయ్ కుమార్, పిటిఒ ఎస్‌పితోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## అమరావతి రైతుల సమస్యలపై పలాయనవాదం

**- రెండు శాతం మందికే సమస్యలంటూ దాటవేత**

**గుంటూరు , సూర్య వాస్తవం:** రాజధాని నిర్మాణానికి తాము ఇచ్చిన భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ తమను పట్టించుకోవడం లేదని అమరావతి రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ నిర్లక్ష్యంపై ఎవరైనా ప్రస్తావిస్తే వారిపై అసత్య ప్రచారం చేస్తున్నారని వాపోతున్నారు. రెండు శాతం మంది రైతులు వారికి అనువైన ప్రాంతంలో రిటర్నబుల్ ప్లాట్లు దక్కలేదన్న భావనతో వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, 98 శాతం మందికి ఎటువంటి సమస్యలూ లేవని సిఆర్‌డిఎ అధికారులు మంత్రులకు, ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పల్లవిని ఎత్తుకొని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ కేవలం రెండు శాతం మందికే సమస్యలు ఉన్నాయని, మిగతా వారంతా సంతోషంగా ఉన్నారని ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## పరకామణి చోరీ కేసులో భూమనను విచారించిన సీఐడీ

(మొదటిపేజీ తరువాయి)
నారా లోకేష్, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, టిడిపి నాయకులు వర్ల రామయ్య, పట్టాభి, బిజెపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి భరించలేకనే సిఐడి అధికారులు తనను విచారణకు పిలిచారని ఆయన చెప్పారు.

## అమరావతి రైతుల సమస్యలపై పలాయనవాదం

(మొదటిపేజీ తరువాయి)
ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెలకు ఒక్కసారి కూడా రైతులతో మంత్రులు, నాయకులు చర్చించిన దాఖలాలు లేవు. ఇటీవల గుంటూరులో రాజధాని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బహిరంగంగా మీడియా ముందుకు వచ్చి సిఆర్‌డిఎ అధికారుల వైఖరిని తూర్పారబట్టారు. దీంతో, ప్రభుత్వంలో కొంత కదలిక వచ్చింది. కానీ, రెండు శాతం మంది రైతులే అసంతృప్తితో ఉన్నారని మంత్రులు, సిఆర్‌డిఎ అధికారులు చెప్పడంపై భూ సమీకరణలో భూములు ఇచ్చిన మెజార్టీ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని అమరావతి విషయమై భవిష్యత్తులో ఎటువంటి మార్పులకూ అవకాశం లేకుండా పార్లమెంటులో చట్టబద్ధత, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల కేసు, జోన్ల కేటాయింపులో ఆర్-5 జోన్ కేసు ఉపసంహరణపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆర్-5 జోన్ పరిధిలో 29 రాజధాని గ్రామాల్లో స్థానికులకు మాత్రమే ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని అమరావతి వాసులు కోరుతున్నారు. సమీకరణకు ఇవ్వని భూముల్లో కొందరి రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు వివాదస్పదమైంది. ఈ సమస్యను సిఆర్‌డిఎ అధికారులు పరిష్కరించడం లేదు. రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులో లోపాలను సరిచేయాలని ఏళ్ల తరబడి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడేళ్లలో అప్పగిస్తామని సిఆర్‌డిఎ చట్టంలో పేర్కొన్నా పదేళ్లు దాటినా అమలు కాలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా అభివృద్ధి చేసిన ప్లాట్ల అప్పగింతలో జాప్యం జరుగుతోందని రైతులు చెబుతున్నారు. దాదాపు వెయ్యి మంది రైతులకు సాంకేతిక కారణాలతో ఆగిపోయిన వార్షిక కౌలు బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు.

## గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

**4.50 కిలోల గంజాయి, 8 సెల్ ఫోన్‌లు, రూ.2700 నగదు, బైకు స్వాధీనం**




**అనంతపురం క్రైమ్- సూర్య వాస్తవం, నవంబర్ 25:** గంజాయి ముఠా గుట్టును అనంతపురం ముడవ పట్టణ పోలీసులు రట్టు చేశారు. విశాఖ జిల్లా తునిలో గంజాయి కొనుగోలు చేసి రైలులో అక్రమంగా తరలిస్తున్న ఏడుగురు గంజాయి విక్రేతలను అరెస్టు చేశారు.వారి నుంచి 4.50 కిలోల గంజాయి, 8 సెల్ ఫోన్‌లు, రూ.2700 నగదు, బైకు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మూడో పట్టణ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్ విలేకరులకు తెలిపారు. అనంతపురానికి చెందిన హాజీ రహమత్, షేక్ అస్లాం బాషా, బందలవాడ రవికుమార్, ఏలూరు సాల్మన్, జ్యోతుల ప్రవీణ్‌కుమార్, సోళ్లెం దినేష్ గౌడ్, బెళుగుప్పకు చెందిన ఎట్టి మనోజ్‌కుమార్ ముఠాగా ఏర్పడి గంజాయి తరలించి విక్రయిస్తుంటారు. విశాఖ జిల్లా తునిలో గంజాయిని కొనుగోలు చేసి దానిని అక్రమంగా రైలులో తరలించి అనంతపురం, బాగేపల్లి ప్రాంతాల్లో విక్రయించేవారు. ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ డిఎస్‌పి వి.శ్రీనివాసులు రావు పర్యవేక్షణలో సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ సి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముఠాపై సిబ్బంది నిఘా ఉంచారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం, రాజీవ్ కాలనీ నుంచి నేషనల్ పార్కుకు వెళ్లేదారిలో నాగులకట్ట వద్ద ఏడుగురిని అరెస్టు చేశారు.

# వైభవంగా అమ్మవారి పంచమీ తీర్థం

**తిరుచానూరు, సూర్య వాస్తవం:** శ్రీ పద్మావతి అమ్మవారు అవతరించిన పంచమి తిథిని పురస్కరించుకుని కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం పంచమీ తీర్థం (చక్రస్నానం) అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో అసంఖ్యాకంగా పవిత్ర స్నానం ఆచరించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది భక్తుల సమూహంలో అమ్మవారి పంచమీ తీర్థ మహోత్సవం వైభవోపేతంగా జరిగిందన్నారు. వేలాది మంది భక్తులు పుణ్య స్థానాలు ఆచరిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు పటిష్టమైన ఏర్పాట్లు చేసి, విజయవంతంగా జరిగాయన్నారు. అన్ని విభాగాల అధికారులు, భద్రతా సిబ్బంది, పోలీసులు, శ్రీవారి సేవకులు, పారిశుద్ధ్య కార్మికులు విశేషంగా కృషి చేశారని వారిని అభినందించారు. భక్తులందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు కలగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

అంతకుముందు ఉదయం శ్రీ పద్మావతి అమ్మవారు పల్లకీలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. అనంతరం అమ్మవారికి ఆస్థానం నిర్వహించి ఊరేగింపుగా పంచమీతీర్థ మండపానికి వేంచేపు చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద తెల్లవారుజామున 4.30 గంటలకు బయలుదేరిన సారె ఉదయం 11 గంటలకు తిరుచానూరు అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అర్చకులు పంచమి తీర్థ మండపంలో సారెను అమ్మవారికి సమర్పించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

**అమ్మవారికి శ్రీవారి కానుక..**

శ్రీ పద్మావతి అమ్మవారి పంచమీ తీర్థం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారు కానుకలు పంపారు. రూ.1.31 కోట్లు విలువైన 1.14 కిలోల బరువు గల బంగారు కమలముల హారం, వజ్రాల అడ్డిగ నగ, సారెతో పాటు తిరుపతి పురవీధులలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు.



**శోభాయమానంగా సిరులతల్లికి స్నపన తిరుమంజనం**

పంచమీ తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు ఉదయం వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన కుంకుమపువ్వు, పైనాపిల్, డ్రై ఫ్రూట్స్, రెడ్, ఎల్లో రోజాపెటల్స్, వట్టివేరు, తులసిమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి.

పంచమి తీర్థం సందర్భంగా పంచమి మండపం వద్ద ఒక టన్ను పుష్పాలతో ఏర్పాటు చేసిన మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో తామర పూలు, రోజాలు, లిల్లీలు తదితర సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్ తో గార్డెన్ సిబ్బంది అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం 12.10 నుండి 12.20 గంటల మధ్య పంచమి తీర్థం (చక్రస్నానం) ఘట్టం ఘనంగా జరిగింది. చక్రత్తాళ్వార్‌తో పాటు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తజనం పద్మ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు బంగారు తిరుచ్చి వాహనంలో అమ్మవారి ఉత్సవర్లను ఊరేగించనున్నారు. అనంతరం రాత్రి 10 నుండి 11 గంటల వరకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం జరుగనుంది. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, చంద్రగిరి ఎంఎల్‌ఏ పులివర్తి నాని, పలువురు బోర్డు సభ్యులు ఎన్. సదాశివరావు, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నరేష్ కుమార్, ఎం.శాంతారామ్, జానకి దేవి, అనుగోలు రెడ్డి, జెఈవో వి.వీరబ్రహ్మం పాల్గొన్నారు.

## ఏపీలో మూడు కొత్త జిల్లాలు

(మొదటిపేజీ తరువాయి)
అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని పెద్ద మండలంగా ఉండటంతో దానిని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు.

**పలు రెవెన్యూ డివిజన్లలో మార్పులు**

శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లోని నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలిపేందుకు మంత్రుల కమిటీ చేసిన సిఫార్సుకు ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లోని మండలాలతో కొత్తగా నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కాకినాడ డివిజన్‌లోని సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేసేందుకు ఆమోదం తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరం మండలాలను, రాజమహేంద్రవరం డివిజన్‌లో కలపాలని నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలాన్ని ఇక నుంచి వాసవీ పెనుగొండ మ ఒడలంగా పేరు మార్చనున్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. దీంతో పాటు అద్దంకి, దర్శి నియోజకవర్గంలోని మండలాలను కలుపుతూ కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మ ర్రిపూడి, పొన్నలూరు మండలాలను కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలుపనున్నారు. నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, కలువాయి, సైదాపురంలను తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యంను చిత్తూరు డివిజన్‌లో కలుపనున్నారు. సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కేవీపల్లి, కలికిరి, వాల్మీకిపురం మండలాలతో పీలేరు రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దవటంలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు. కదిరి డివిజన్‌లోని అమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పుట్టపర్తి డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజన్‌లో కలుపనున్నారు. నంద్యాల జిల్లా డోన్ రెవెన్యూ డివిజన్‌లోని బనగానపల్లె, అవుకు , కోవెలకుంట్ల, నంద్యాల డివిజన్‌లోని సంజామల, కొలిమిగుండ్ల మండలాలతో కొత్తగా బనగానపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.

**9 జిల్లాలో ఎటువంటి మార్పులు లేవు**

మంత్రుల కమిటీ సిఫార్సులతో కొత్తగా ఏర్పాటు చేసే జిల్లాలు, రెవెన్యూ డివిజన్లతో ప్రస్తుతం 17 జిల్లాల్లో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. మిగిలిన 9 జిల్లాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. ఆ జాబితాలో విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్టణం, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, అనంతపురం జిల్లాలు ఉన్నాయి. మంత్రులు కమిటీ చేసిన సిఫార్సుల జాబితాపై త్వరలో జరుగనున్న కేబినెట్ భేటీలో చర్చించి ఆమోదముద్ర వేయనున్నారు. అనంతరం కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్ల మార్పు చేర్పులపై అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**మూడు జిల్లాల భౌగోళిక స్వరూపం ఇలా..**

మార్కాపురం జిల్లా : మార్కాపురం జిల్లాలో మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఇప్పటికే ఉన్న కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లతో కొత్త జిల్లా ఏర్పాటు కానుంది. మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, కనిగిరి డివిజన్‌లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెద్ద చెర్లోపల్లి, చంద్రశేఖర పురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్త జిల్లాలో ఉండనున్నాయి.

**కొత్త జిల్లా జనాభా 11.42 లక్షలు.**

పోలవరం జిల్లా : పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా చింతూరు డివిజన్‌ను కలుపుకుని ఏర్పాటు కానుంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లోని రంపచోడవరం, దేవీపట్నం, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఉన్నాయి, చింతూరు డివిజన్‌లోని ఎటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు. పోలవరం జిల్లాలో 3.49లక్షల జనాభా ఉంది.

**మదనపల్లి జిల్లా :** మదనపల్లి, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్‌లతో కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పాటు కానుంది. మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లోని మదనపల్లి, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీ సముద్రం, బీరొంగి కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు, అలాగే పీలేరు డివిజన్‌లోని సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకీపురం మండలాలు ఉన్నాయి.

# అయ్యప్ప దీక్ష ఆరోగ్య రక్ష

# అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన నామాల గుట్ట

- పడి పూజతో పరవశించిన అయ్యప్ప మాలధారణ భక్తులు
- పడిపూజ కార్యక్రమంలో పాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** అయ్యప్ప దీక్ష ఆరోగ్య రక్ష అని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. అయ్యప్ప మాలదరణ స్వీకరించిన అయ్యప్ప భక్తులు మంగళవారం మండలంలోని నామాల గుట్టపై నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప నామస్మరణతో మారుమోగించారు. గురుస్వాములు వెంకటేశు, గంగరాజు, గంగాధర్ రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని అయ్యప్ప మాలధారణ భక్తులుతో కలిసి అయ్యప్ప భజనలలో పాల్గొన్నారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి సతీమణి మాధవి తో కలిసి అయ్యప్ప ఉత్సవ విగ్రహాలకు గురుస్వాముల ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించి, నామాల గుట్టపై వెలసిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పూజాధి కార్యక్రమాలు చేసి, స్వామియే శరణమయ్యప్ప అంటూ మాలాధారణ భక్తులు పడిపూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదానాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి నీ ఆలయ కమిటీ నిర్వాహకులు గురుస్వాములు దుషాళువతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, జనార్దన్ రెడ్డి, గంగరాజు, శివ శంకర్ రెడ్డి, అయ్యప్ప స్వామి గురు స్వాములు బుజ్జి, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

- ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ




**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలలో రైతుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. పెళ్లకూరు మండలంలోని రావులపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "రైతన్నా - మీకోసం" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి రైతు ఇంటిని సందర్శించి 'రైతన్నా - మీకోసం' కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, రైతు కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి ప్రయోజనాలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. రైతు ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు అమలు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమని రైతులకు సూచించారు. నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు చేరాల్సిన సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణ రెడ్డి, టిడిపి నాయకులు రమేష్ నాయుడు, వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు

# రోడ్డు సేఫ్టీ వారియర్స్ బృందాలతో కట్టుదిట్టమైన చర్యలు

- ప్రతి వాహనదారుడు నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చు
- జిల్లా యస్.పి. డా. అజిత వేజెండ్ల



**నెల్లూరు - సూర్య వాస్తవం:** ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు రోడ్ సేఫ్టీ వారియర్స్, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, వారు చేయవలసిన విధివిధానాలను పి పి టి ద్వారా సమగ్రంగా వివరించిన యస్.పి. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గిస్తూ ప్రజల ప్రాణ భద్రతను కాపాడేందుకు జిల్లా యస్.పి. గారు సమగ్ర కార్యాచరణను అమలు చేస్తూ, వినూత్నంగా జిల్లాను 6 డివిజన్ లుగా విభజించి, ప్రతి సబ్ డివిజన్ కు ఒక ఎస్సై స్థాయి అధికారి మరియు సిబ్బంతో మొత్తం 6 బృందాలు, 62 మందితో రోడ్ సేఫ్టీ వారియర్స్ బృందాలు ఏర్పాటు. రోడ్ సేఫ్టీ వారియర్స్ బృందం నిబద్దతతో విధులు నిర్వహించాలి. మీ ఉద్యోగం చాలా కీలకమైనది. జిల్లాలోని హైవే, బ్లాక్ స్పాట్స్, రోడ్డు ప్రమాదాలు జరిగే సమయం, వాహనాలు, గోల్డెన్ హావర్, ఎన్ఫోర్స్మెంట్, స్కూల్, కాలేజీలలో అవగాహన తదితర విధులపై దిశానిర్దేశం. ప్రతి బృందానికి ఇచ్చే ప్రణాళికలను కచ్చితంగా అమలు చేయాలి. ప్రతి ఒక్కరి ప్రాణం చాలా ముఖ్యమైనది. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచే దిశగా వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడి. ప్రతి వాహనదారుడు నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చు. హెల్మెట్ - సీట్‌బెల్ట్ తప్పనిసరి. మద్యం సేవించి వాహనం నడపకండి. రోడ్డు భద్రత కోసం పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజల సహకారమే అత్యంత ముఖ్యమైనది. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణ భద్రత కోసం పోలీసులు నిరంతరంగా చర్యలు, విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ సమావేశంలో జిల్లా యస్.పి.తో పాటు అడిషనల్ యస్.పి. (అడ్మిన్) సౌజన్య, రూరల్ డిఎస్పీ గట్టమనేని శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పీ గిరిధర్, ట్రాఫిక్, డిసి ఆర్‌బి, పిసి ఆర్, సైబర్, ఎస్సీ/ఎస్టీ, సెల్ ఎస్బి-2 సిఐ, వెల్ఫేర్ ఆర్ఐ, అన్ని సబ్ డివిజన్ల రోడ్ సేఫ్టీ వారియర్స్ బృందం ఇంచార్జి ఎస్సై సిబ్బంది పాల్గొన్నారు.

## మెజార్టీ తక్కువ ఉన్న బూతులను పరిశీలించిన మండల అబ్జర్వర్ ఉమేష్



**గాండ్లపెంట - సూర్య వాస్తవం:** మడకశిర నియోజకవర్గం ఆగలి మండల జడ్పిటిసి ఉమేష్, గాండ్లపెంట అబ్జర్వర్ గా మండలానికి రావడం జరిగినది. మండల నాయకులతో సమావేశమై బూతుల మెజార్టీ గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే స్థానిక ఎలక్షన్లలో మెజార్టీ తక్కువ వచ్చే బూతులను తక్కువ రాకుండా చూసుకోవాలని కార్యకర్తలకు చెప్పడం జరిగింది. తక్కువ ఉన్న బూతులను పరిశీలించి మెజార్టీ ఎందుకు తగ్గింది అని అడిగి తెలుసుకుని కార్యకర్తలకు ఉద్దేశించి మెజార్టీ తక్కువ ఉన్న బూతులను మెజార్టీ పెంచే వైపుగా కొన్ని సూచనలను ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్



**మదనపల్లె - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరిని మదనపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి డిఎస్పి మహేంద్ర మంగళవారం మీడియాకు తెలిపిన వివరాలు అన్నమయ్య జిల్లా, మదనపల్లి ఎస్బిఐ కాలనీ గ్లోబల్ ఆసుపత్రి కేంద్రంగా కిడ్నీ రాకెట్ వ్యవహారం బట్టబయలు కావడం తెలిసిందే. ఈ కేసులో విశాఖకు చెందిన యమున 29 కిడ్నీని కిడ్నీ రాకెట్ దొంగలించి ఆమెను హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే అన్నమయ్య జిల్లా డిసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు సహా మరో ఐదుగురిని అరెస్టుచేయగా, తప్పించుకు తిరుగుతున్న కడప ప్రకాష్ నగర్ కు చెందిన ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు నిందితులు సుమన్, కొండయ్య లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంకా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సి ఉందని డి.ఎస్.పి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు



**మదనపల్లి - సూర్య వాస్తవం :** గుర్రంకొండ మండలంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం మట్టివారి పల్లి కు చెందిన రైతులు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి సొంత పనిపై గుర్రంకొండకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సంఘసముద్రం పెట్రోల్ బంకు వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్ను ఢీ కొట్టి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను గుర్రంకొండ 108 సిబ్బంది చికిత్సల నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా, డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలు కుంటూ ఉన్నారు.

## గొంతు కోసుకుని భవన కార్మికుడు ఆత్మహత్యాయత్నం



**మదనపల్లి - సూర్య వాస్తవం:** కర్ణాటక రాయలపాడు లో ఓ భవన కార్మికుడు మంగళవారం రాత్రి చేతి నరాలు, గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనపై మదనపల్లె జిల్లా ఆసుపత్రి ఓపి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయలపాడు బూరగమాకులపల్లి కు చెందిన భవన కార్మికుడు మురగయ్య 30 భవన నిర్మాణం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సాయంత్రం పూటగా మద్యం తాగి రాయల్పాడు లో చేతి నరాలు గొంతు కోసుకొని ఆత్మహత్య ఇయత్నానికి పాల్పడగా స్థానికులు గమనించి బాధితులని 108 లో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలు కుంటూ ఉన్నాడు.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## 48వ డివిజన్‌లో విజయవంతంగా కోటి సంతకాల సేకరణ

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు - సూర్య వాస్తవం:** నెల్లూరు లో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని వైసీపీ జిల్లా మైనారిటీ అధ్యక్షులు డివిజన్ ఇంచార్జ్ షేక్ సిద్దిఖ్ డివిజన్ వైసిపి నాయకులతో కలిసి, కోటి సంతకాల సేకరణలో పూర్తి చేసిన 4 వేల కాపీలను పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కి అందజేశారు.కోటి సంతకాల సేకరణ కార్యక్రమం లో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని.. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ముందుకొచ్చి సంతకాలు చేస్తున్నారని చంద్రశేఖర్ రెడ్డి కి వారు తెలిపారు.ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని.. విజయవంతం చేసిన పలువురు డివిజన్ నేతలను చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు రఫీ, మస్తాన్, సురేష్, ఆవుల నాగేంద్ర, ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ ప్రాథమిక పాఠశాల తనిఖీ

- డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ) షేక్ ఖాజా మొహిద్దీన్



**పొదలకూరు - సూర్య వాస్తవం:** పట్టణంలోని ఆగచాట్లపురంలో వున్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి విద్యార్ది ఇష్టపడి చదవాలని అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థి స్థాయిని గుర్తించి వారు ఏఏ విషయాల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకొని తగు విధంగా బోధించాలని అన్నారు. తల్లిదండ్రుల సమావేశాలు తరచుగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను వివరించి విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని అన్నారు. అలాగే ఎస్.ఏ-1 పరీక్షల మార్కులను ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**మదనపల్లె - సూర్య వాస్తవం :** పెద్దమండెం మండలంలో మంగళవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురు ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై జిల్లా ఆస్పత్రి ఓపి పోలీసుల కథనం మేరకు వివరాలు.. అన్నమయ్య జిల్లా, రాయచోటి కాకులారంకు చెందిన శ్రీనివాసులు (50) సొంత పనిమీద బైకులో పెద్దమండెంకు వచ్చాడు. స్థానిక చెరువు కింద పల్లెలో ఉన్న బంధువుల ఇంటికి బైకులో వెళుతుండగా, మార్గ మధ్యంలోని చెరువు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో పెద్దమండెం కు చెందిన కూలీలు మాబుఖాన్ (45), రెడ్డిభాషా(30) లు సైతం తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే చికిత్సల నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్లు వైద్యం అందించారు. వారిలో రాయచోటికి చెందిన శ్రీనివాసులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో డాక్టర్లు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.





## గిరిజన గురుకుల పాఠశాలలో

# నలుగురు విద్యార్థులకు అస్వస్థత

- అన్నంలో పురుగులు - కుళ్ళిన కూరగాయలలో ఎలుకలు
- వంట మనిషి లేక నైట్ వాచ్ మెన్ విద్యార్థులకు అన్నం వండి పెడుతున్న వైనం
- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని నాణ్యమైన భోజనం
- కన్నెత్తి చూడని జిల్లా అధికారులు - ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ తో విద్యార్థులకు అవస్థలు







**గోరంట్ల - సూర్య వాస్తవం:** గోరంట్ల పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలోని నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది, దీంతో వైష్ణవి 9వ తరగతి, వైష్ణవి 10 వ తరగతి, భానుప్రియ 6 వ తరగతి, జాహ్నవి 8 వ తరగతి విద్యార్థులకు ఏఎన్ఎం విజయ ప్రథమ చికిత్సలు నిర్వహించి వెంటనే పరిస్థితిఅదుపులోకి రాకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు,అయితే గత కొంతకాలంగా వంట మనిషి లేకపోవడంతో పాఠశాలలో రాత్రి వేళల్లో డ్యూటీ నిర్వహించాల్సిన నైట్ వాచ్మెన్ వంటమనిషి అవతార్మెత్తి ఆమె మూడు పూటలా విద్యార్థులకు అన్నం వండి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది, అయితే ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో హిందూపురం ప్రిన్సిపాల్ తులసి కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు, అయితే పాఠశాలలో బాలికలకు ప్రభుత్వం ఆదేశాల మేరకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాల్సి ఉండగా వంటగది సక్రమంగా లేకపోవడంతో అధ్వానంగా మారి వాసన వస్తుంది, నాణ్యమైన కూరగాయలతో లేకపోవడంతో పాటు అన్నంలో పురుగులు, వంట గదిలో ఎలుకలు తిరుగుతూ విద్యార్థులు తింటున్న అన్నం పప్పు తో పాటు కూరగాయలపై తిరుగుతూనే ఉన్నాయి, వంట గదిలోకి ప్రత్యక్షమైతే ఎలుకలు తిరుగుతున్న దృశ్యం కనబడుతుంది,

అయినా దొరికిన ఎలుకలను చంపుతున్నారు, విద్యార్థులు తింటున్న అన్నం విషయంలో ఇంత నిర్లక్ష్యమా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ప్రతిరోజు విద్యార్థులకు సరైన నాణ్యమైన భోజనం వండి పెట్టకపోవడంతో ప్రతిరోజు పదుల సంఖ్యలో విద్యార్థులు జ్వరం లేదా వాంతులు విరేచనాలతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నారు, గిరిజన గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి నాణ్యమైన విద్యను నాణ్యమైన భోజనాన్ని అందించడంలో చర్యలు తీసుకోవాల్సిన జిల్లా అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పాటు కన్నెత్తి చూడక పోవడంతో విద్యార్థులకు శాపంగా మారింది,ఈ సంఘటన మంత్రి సవితమ్మ దృష్టికి వెళ్లడంతో వెంటనే విద్యార్థులకు మెరుగైన చికిత్సలు అందించి నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది, ఈ విషయంపై వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ మాట్లాడుతూ వంట గది స్థితిలో వస్తకు చేరుకోందని దీంతో ఎలుకలు తిరుగు తున్నాయని విద్యార్థులు వాంతులు విరేచనాలతో పాటు జ్వరం రావడంతో వెంటనే ఏఎన్ఎం సహాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించామని ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని ఆమె మీడియాకు తెలిపారు. అదేవిధంగా ఆల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవి నాయక్ పాఠశాలను మరియు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సమస్యలపై మంత్రి సవితమ్మకు మరియు ట్రైబల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు.

# తెలుగు గంగ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు

- 4600 పంట భూమికి చేరనున్న తెలుగు గంగ నీరు
- ఐదవ బ్రాంచ్ కాలువకు జలహారతి - రైతులకు అభినందనలు - ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ
- వెంకటగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కురగొండ రామకృష్ణ - గూడూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పాశం సునీల్





**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని తెలుగు గంగా ప్రాజెక్ట్‌లో అత్యంత కీలకమైన ఐదవ బ్రాంచ్ కాలువకు సోమవారం ఘనంగా జలహారతి నిర్వహించి, సాగునీటి విడుదలకు పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభం చేశారు.అతిథులుగా వచ్చిన ప్రజాప్రతినిధులకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులను శాలువాలతో, పూలమాలతో సత్కరించారు. విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు, ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ సాగునీటి సమస్యలు తీరేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ఈ నీటి విడుదలతో ఒజిలి మండలంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు భారీగా లాభం చేకూరుతుందన్నారు. జలహారతి అనంతరం తెలుగు గంగా ఐదవ బ్రాంచ్ కాలువలో నీరు ప్రవహించడం రైతులకు ఉత్సాహాన్ని కలిగించింది. ఈ ప్రవాహంతో దాదాపు 28 యం ఐ ట్యాంకులు నిండనున్నాయని, 4,600 ఎకరాల స్థిరీకరించిన సాగుభూములకు నీరు చేరనున్నదని అధికారులు వివరించారు. నీటి లభ్యత పెరగడం వలన రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురగొండ రామకృష్ణ మాట్లాడుతూ, నీటి పంపిణీ సమర్థవంతంగా జరగాలని, ప్రతి రైతుకు సమానంగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతుల యొక్క సంక్షేమం దృష్టిలో ఉంచుకొని ఈ యొక్క తెలుగు గంగ నీటి విడుదల చేసి ప్రాంతల అభివృద్ధికి కొరకు రైతులకు మీరు అందించి పంట భూమికి మరింత అభివృద్ధి కు దోహదం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అధికారులతో పాటు పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.

## పాటూరి వారి వివాహ రిసెప్షన్‌కి హాజరైన మాజీ మంత్రి మాలగుండ్ల, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

**గోరంట్ల - సూర్య వాస్తవం:** గోరంట్ల మండలం లోని కలగేరి గ్రామానికి చెందిన మాజీ ఏ డి సి సి బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి చిన్నాన్న పాటూరి గోవిందరెడ్డి కుమార్తె హేమలత %d% అశోక్ కుమార్ రెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి కొత్త చెరువు శ్రీ లక్ష్మీవెంకటేశ్వర కల్యాణ మండపం నందు హాజరై నూతన వధూవరులను మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ మరియు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తో పాటు సర్పంచ్ శివానంద, వెంకట రమణ,విజయ్ సింహ రెడ్డి, రంగా రెడ్డి, తులసి కుమార్, లక్ష్మి రెడ్డి తో పాటు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రేణుక ఎల్లమ్మ తల్లి
# నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

## - ముఖ్యఅతిథిగా కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి



**వేముల - సూర్య వాస్తవం:** పులివెందుల నియోజక వర్గంలోని వేముల మండలంలోని వేముల కొత్తపల్లిలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి కొత్తపల్లె గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి విచ్చేయడంతో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు, అర్చకులు గడియారం కిరణ్ కుమార్ శర్మ చే స్వాగతం పలికారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి ప్రాత :కాల పూజలు, మహా స్నపనం, ఆవాహిత దేవత హెూమాలు, చండీ, రుద్ర, లక్ష్మీనారాయణ హెూమాలు, నివేదన, మంగళహారతి, చండీ, రుద్ర, లక్ష్మీనారాయణ హెూమాలు, నివేదన, మంగళహారతి నిర్వహించడం జరిగింది. ఉదయం 10 గంటల నుండి కోలాటం, మధ్యాహ్నం 2 గంటల నుండి బృందావనం, 2:30 గంటలకు మేరవని తోపాటు ప్రదోషకాల పూజలు, విగ్రహాలకు శయ్యా దివాసం, ధ్యాన దివాసం, పుష్పదివాసం, స్వస్తి, మంగళహారతి, అన్నదానం కార్యక్రమలు మొదలగునవి నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కోకటం వెంకట బయపురెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము), మాజీ పిసిబి డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీఎంపీటీసీ చందా మల్ రెడ్డి, ఎంపీటీసీ చందా లీలావతి, సర్పంచులు శ్రీనివాసులు, కొప్పుల గంగరాజు, బండలకొండ రెడ్డి, పోరెడ్డి రాఘవరెడ్డి, వేమ నారాయణరెడ్డి, పో రెడ్డి సుబ్బారెడ్డి, పేర్ల రామసుబ్బారెడ్డి, చందా రమేష్ రెడ్డి, కొవ్వూరు గంగాధర, య ర్ర గొర్ల చలపతి, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గట్టి బందోబస్తును ఏర్పాటు చేసిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ చంద్రశేఖర్, రాజేంద్ర, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఫైలేరియా నిర్మూలన లక్ష్యంతో ఇంటింటా సర్వే

## - జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ : ఖాజా మౌనిద్దీన్







**లింగాల - సూర్య వాస్తవం:** లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తేర్నంపల్లె లో సోమవారం రాత్రి ఇంటింటా ఫైలేరియా సర్వే నిర్వహించడమైనది. ఈ సర్వే ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి రక్త నమూనాలు సేకరించడమైనది.

ఈ కార్యక్రమములో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ ఖాజా మౌనిద్దీన్ మాట్లాడుతూ ఫైలేరియా అనేది క్యూలెక్స్ దోమ కాటు ద్వారా వ్యాది సోకుతుంది ఫైలేరియా ఉన్న వ్యక్తిని దోమ కుడుతుంది. ఆ వ్యక్తి రక్తంలో ఉన్న మైక్రోఫైలేరియా దోమ శరీరంలోకి వెళ్తాయి. దోమలో అవి అభివృద్ధి చెందుతాయి తర్వాత ఆ దోమ ఇంకో ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుడితే, ఆ లార్వాలు కొత్త వ్యక్తి రక్త నాళాల్లోకి వెళ్ళి లింఫ్ నాళాల్లో పెరిగి పెద్ద పురుగులుగా మారతాయి. దీని వలన క్రమంగా లింఫ్ బ్లాకేజీ ఏర్పడి వాపులు వస్తాయి. ఎక్కువగా దోమలు పెరిగేప్రదేశాలు. కాలువలు, డ్రైనేజీ, నిల్వ నీరు, చెత్త గుట్టలు, మురుగు నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో దోమలు పెరుగుతాయ. అని డాక్టర్ : ఖాజా మౌనిద్దీన్ అన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని, దోమలు వృద్ధి చెందకుండా నీటి డ్రమ్ములపైన, తొట్లపైన మూతలు ఉంచాలని ప్రతి శు క్రవారం డ్రైడే పాటించాలని కాలువలు, చెత్త గుంతలను శు భ్రం చేస్తూ ఉండాలి, రాత్రి తప్పనిసరిగా దోమతెరాలు వాడాలి, ఫైలేరియా లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి అని సిద్దయ్య తెలిపారు ఈ కార్యక్రమములో పి.హెచ్.ఎన్. కుసుమకుమారి, సూపర్ వైజర్ ఆసియా బేగం, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మి, దీవెనమ్మ, అనురాధ, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, ఆశా కార్యకర్త భవానీ పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ రూపకర్త
# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



**వేంపల్లి - సూర్య వాస్తవం:** భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం నవంబర్ 26 న మన దేశంలో 'సంవిధాన్ దివస్' అని కూడా పిలువబడే రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారని. 1949 నవంబర్ 26న, భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని ఇది 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చిందని కాంగ్రెస్, కడప జిల్లా మాజీ కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, ముందుగా మొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్, నేతృత్వంలోని రాజ్యాంగ సభ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సారధిగా డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసి రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడానికి శ్రమించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం మాట్లాడుతూ. రాజ్యాంగ దినోత్సవం అంటే నవంబర్ 26, 1949 న భారత రాజ్యాంగాన్ని ఆమోదించడాన్ని సూచిస్తుంది. ఇది భారతదేశం యొక్క ప్రజాస్వామ్య విలువలను జరుపుకుంటుంది, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంపై అవగాహనను ప్రోత్సహిస్తుం దని ఈ సందర్భంగా ప్రజాస్వామ్య వాదులందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆధార్ కేంద్రం లేక ప్రజల అవస్థలు



**తొండూరు - సూర్య వాస్తవం:** తొండూరు మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్‌కార్డు దరఖాస్తు చేయాలన్నా, కొత్తగా పెళ్లి చేసుకుని వచ్చిన వారి చిరునామా మార్పుతో పాటు, ఆధార్‌కార్డులో తప్పొప్పుల సవరణకు పట్టణ కేంద్రానికి, ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తీరా అక్కడకి వెళ్లాక ఇంటర్నెట్, ఇతర సాంకేతిక సమస్యలతో పనులు జరగడం లేదని, అక్కడ ప్రజల రద్దీ నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఉండేది. ప్రస్తుతం ఆధార్ కేంద్రం ఇనగలూరు సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని గత రెండు నెలల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మండల వాసులకు ఆధార్ సేవలు దూరమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆధార్ కేంద్రాన్ని తొండూరు సచివాలయంలోనే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# శక్తి యాప్ ద్వారా మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

## - డిఎస్పి మురళి నాయక్



**పులివెందుల - సూర్య వాస్తవం:** మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తోందని డిఎస్పి మురళి నాయక్ తెలిపారు. మంగళవారం జిల్లాలో మహిళలు, ప్రజలకు అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్లతో కూడిన పోస్టర్లను జిల్లా ఎస్పీ స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మురళి మాట్లాడుతూ 'శక్తి' బృందాలు, ఉమెన్ హెల్ప్ డెస్క్‌లు మరియు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 2025 సంవత్సరంలో మేము అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.

**శక్తి బృందాల ద్వారా విస్తృత అవగాహన:** మహిళలు మరియు విద్యార్థినులకు చట్టాలు, ఆత్మరక్షణపై అవగాహన కల్పించడానికి శక్తి బృందాలు మార్చి 22, నుండి నవంబర్ 24, వరకు విస్తృతంగా పనిచేశాయి. అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,110 అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి, వీటిలో 96,852 మంది పాల్గొన్నారు.

**ఆత్మరక్షణ శిక్షణ:** విద్యార్థినులలో మనోధైర్యాన్ని నింపడానికి 157 సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాలను నిర్వహించాము, దీని ద్వారా 13,306 మంది విద్యార్థినులు లబ్ది పొందారు.

**కౌన్సెలింగ్, సమస్యల పరిష్కారం:** కుటుంబ సమస్యలను సామరస్యంగా పరిష్కరించడానికి కడప మహిళా పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాము.

**ఫిర్యాదుల పరిష్కారం:** 2025లో (నవంబర్ 25 వరకు) 686 జనరల్ పిటిషన్లు రాగా, కౌన్సెలింగ్ ద్వారా 518 కేసులను రాజీ కుదిర్చాము. కౌన్సెలింగ్ సెషన్లు: ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 935 కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించబడ్డాయి.

**ఉమెన్ హెల్ప్ డెస్క్:** ఏప్రిల్ నుండి అక్టోబర్ 2025 మధ్యకాలంలో, జిల్లాలోని ఉమెన్ హెల్ప్ డెస్క్‌లకు 2,083 ఫిర్యాదులు వచ్చాయి.

**ప్రేమ వివాహ సంబంధిత సమస్యలు:** మేజర్ల నుండి ప్రేమ, వివాహ సమస్యలకు సంబంధించి 124 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి.

**సాంకేతిక భద్రత - శక్తి యాప్:** ప్రతి మహిళ తమ ఫోన్‌లో 'శక్తి' యాప్‌ను కలిగి ఉండటం అత్యవసరం.

**రిజిస్ట్రేషన్లు:** ఇప్పటివరకు జిల్లాలో 25,494 మంది యాప్‌లో రిజిస్టర్ అయ్యారు.

**స్పందన:** 2025లో కంట్రోల్ రూమ్ ద్వారా 6,623 అలర్ట్స్/కాల్స్ (టెస్ట్ కాల్స్‌తో కలిపి) పర్యవేక్షించబడ్డాయి, 166 అత్యవసర కాల్స్‌కు తక్షణ సహాయం అందించాము.

**మహిళలకు పోలీసుల భద్రతా సూచనలు:** శక్తి యాప్ ప్రతి మహిళ మరియు విద్యార్థిని తప్పనిసరిగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో ఇది మీ లొకేషన్‌ను నేరుగా పోలీసులకు పంపుతుంది.

**సైబర్ జాగ్రత్తలు:** సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత ఫోటోలు లేదా సమాచారాన్ని పంచుకోవద్దు. ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేస్తే భయపడకుండా ఫిర్యాదు చేయండి.

**ప్రయాణ భద్రత:** రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించేటప్పుడు, మీ లైవ్ లొకేషన్‌ను కుటుంబ సభ్యులతో షేర్ చేయండి.

**నిర్భయంగా ఫిర్యాదు చేయండి:** ఈవ్ టీజింగ్, వేధింపులు లేదా గృహ హింస ఎదురైతే, వెంటనే దగ్గర్లోని ఉమెన్ హెల్ప్ డెస్క్ లేదా శక్తి బృందాన్ని సంప్రదించండి.

**అత్యవసర నంబర్లు:** డయల్: 100 / 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్: 1930. మహిళా భద్రత మా బాధ్యత. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని డి.ఎస్.పి మురళి నాయక్ కోరారు.

# ఓపెన్ క్యాటగిరి పరుగు పందెంలో స్వర్ణ పథకాన్ని సాధించిన శివమల్లి

## - తెలంగాణ అథ్లెటిక్స్ ఓపెన్ క్యాటగిరిలో బంగారు పతకం సాధించిన కడప అమ్మాయి




**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** తెలంగాణ అథ్లెటిక్స్ ఓపెన్ క్యాటగిరిలో ఛాంపియన్ షిప్ లో కడప అమ్మాయి గోల్డ్ మెడల్ సాధించింది హైదరాబాదులో జరిగిన తెలంగాణ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025లో కడప జిల్లా సింహాద్రిపురం మండలం దిద్దికుంట గ్రామానికి చెందిన పెద్ద సోమప్ప శివమల్లి ఓపెన్ క్యాటగిరి ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ గెలుచుకుంది తెలంగాణ అథ్లెటిక్స్ ఓపెన్ క్యాటగిరి ఛాంపియన్ షిప్ లొ పెద్ద సోమప్ప శివమల్లి చూపిన అసమాన ప్రతిభ పై పులివెందులోని ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఓపెన్ క్యాటగిరి ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పథకాన్ని సాధించి కడప జిల్లా ప్రతిష్టను తెలుగు రాష్ట్రాల వేదికపై చాటి చెప్పిన పెద్ద సోమప్ప శివమల్లి కి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అనంతరం పెద్ద సోమప్ప శివమల్లి మాట్లాడుతూ స్వర్ణపతకం సాధించినందుకు చాలా సంతోషంగా ఉన్నానని నా తల్లిదండ్రులు కూడా చాలా సంతోషంగా గర్వంగా ఉన్నారు అని అన్నారు.

## మహిళల పట్ల వివక్షత వద్దు



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** మహిళల పట్ల వివక్షత వద్దని పురుషులతో పాటు సమానంగా చూడాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో జెండర్ క్యాంపెయిన్ లో భాగంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వాలు మహిళలకు ఎన్నో రకాల పథకాలు అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అనే విధంగా ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే ఆ ఇంట్లో ప్రతి ఒక్కరు విద్యావంతులు అవుతారని ఆయన అన్నారు. మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాలు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. ప్రతి మహిళ అభివృద్ధి అయితే ఆ కుటుంబం అభివృద్ధి బాటలో నడుస్తుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రెడ్డన్న ఏ ఎస్ ఐ మస్తానయ్య ఏపీఎం నిరంజన్ మహిళలు పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి చంద్రబాబు



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఏపీ అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగొల్ల రెడ్డయ్య యాదవ్ మాజీ డిసిసి బ్యాంక్ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అప్పకొండయ్య గారిపల్లి, దిన్నెపాడు, లక్కిరెడ్డిపల్లి గ్రామంలో పర్యటించి ఇంటింటికి సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత 46.86 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందని వారు గుర్తు చేశారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల కోసం ప్రత్యేక పథకాలు ఏర్పాటు చేసి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మీ సంగం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ దండు శ్రీనివాసులు టిడిపి మైనార్టీ యువజన నాయకుడు షేక్ ఆరిఫ్, మార్ల మోహన్ రెడ్డి, ఘోర, పటాన్ సాదుల్లా, ముక్తియర్ అహ్మద్ చీరల సుధాకర్ యాదవ్ నాగమణి నాయుడు భాస్కర్ రెడ్డి బడుగు వాసుదేవుడు నసీరుద్దీన్ ధర్మారెడ్డి రవి ఆచారి రామకృష్ణ, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** కష్టపడి చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రత్యేక అధికారణి ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఇంటర్మీడియట్ చదివే సమయంలోనే భవిష్యత్తుకు బాట వేయాలన్నారు. చెడు అలవాటులకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆత్మవిశ్వాసంతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి ప్రయోజకుడు అయినప్పుడే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఆ పాఠశాలకు పేరు వస్తుందన్నారు. 2025-26 సంవత్సరంలో జరగబోవు పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటసుబ్బయ్య ప్రిన్సిపాల్ వరాల రమేష్ వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల మహిళ సమాఖ్య మహాసభ




**వేముల - సూర్య వాస్తవం:** వేముల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించిన మహాసభ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి సతీమణి లక్ష్మీ , పార్థసారధి రెడ్డి సోదరుడు పేర్ల శేషారెడ్డి. ఏపిఎం ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ మహాసభ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలును మహిళా సంఘాల సభ్యులు ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాలు తీసుకున్న రుణాల తో చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాలు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మహిళలు ఆర్థికంగానే కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. మహిళ సంఘ సభ్యురాలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలందరి భాగస్వామ్యంతో

# వారసత్వ కట్టడాల పరిరక్షణ చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్






**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం:** ప్రజలందరి భాగస్వామ్యంతో వారసత్వ కట్టడాల పరిరక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శన శాలలో పురావస్తు, ప్రదర్శన శాలల శాఖ, ఇంటాక్, డిస్కవర్ అనంతపురము, లేడీస్ క్లబ్, ఇన్నర్ వీల్‌లు సంయుక్తంగా ఏడు రోజుల పాటు నిర్వహించిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2025 ఘనంగా ముగియగా, ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ వారోత్సవాలను ఈనెల 19వతేదీ నుంచి ఈరోజు వరకు నిర్వహించడం జరిగిందని, రాష్ట్ర పురావస్తు %ౘ% ప్రదర్శన శాలల శాఖ, ఇంటాక్, డిస్కవర్ అనంతపురం, లేడీస్ క్లబ్ మరియు ఇన్నర్ వీల్ లు సంయుక్తంగా ఏడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇంటాక్ సంస్థ, డిస్కవర్, లేడీస్ క్లబ్ మరియు ఇన్నర్ వీల్ లాంటి సంస్థలు వారసత్వ కట్టడాల పరిరక్షణకు ముందుకు వచ్చి వాటిని కాపాడుకోవడమేకాక, వాటిని ప్రమోట్ చేసే బాధ్యతను తీసుకోవడం అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నెలకొకమారు ఏదో ఒక చోట చేస్తుండాలని, అలాంటప్పుడే పిల్లలకు, ప్రజలకు మన సంస్కృతి, వారసత్వం గురించి అవగాహన వస్తుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిల్పారామం, ఆర్కియాలజీ మ్యూజియం, తదితర వాటికి పిల్లలను తీసుకువెళ్లాలన్నారు. అవుట్ డోర్ కార్యక్రమాల్లో పాల్గొనాలని, ప్రపంచ వారసత్వ వారోత్సవాలను విజయవంతం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శన శాలల శాఖ సహాయ సంచాలకులు స్వామి నాయక్ మాట్లాడుతూ వారోత్సవాలు విజయవంతముగా ముగియడం జరిగిందని, మొదటి రోజున హెరిటేజ్ వాక్ మొదలుకొని, నాణేములు మరియు స్టాంప్స్ ప్రదర్శన, పద్య పఠనం, మానవ మనుగడలో చెట్ల పాత్ర సంప్రదాయ వంటలు ల వంటి కార్యక్రమాల గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ రామకుమార్, డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్, లేడిస్ క్లబ్ సెక్రటరీ పద్మ నారాయణ రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ జయంతి, ఇంటాక్ కో కన్వీనర్ పిడతల కృష్ణమూర్తి, జిల్లా పర్యటకాధికారి జయకుమార్ బాబు, ఇంటాక్ సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ రియాజుద్దీన్ అహమ్మద్, డాఎం సిగిలిరేవు రామాంజినేయులు, టి.వి.రెడ్డి, యాడికి సూర్యనారాయణ రెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, అశోకవర్ధన్ రెడ్డి మరియు పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ సేవలు నిత్య స్మరణీయం

## - మై భారత్ ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ 150 ఏకతా పాదయాత్ర







**గుంతకల్లు - సూర్య వాస్తవం:** ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ అనంతపురం జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ 150 ఐక్యత ఏక్ భారత్ ఆత్మ నిర్భర్ భారత్ మార్చ్ పాదయాత్రను గుంతకల్లు నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ, సిఐ మనోహర్, ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపకులు మంజుల వెంకటేష్,

మై భారత్ ప్రోగ్రాం ఇంచార్జ్ జి. శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, జయ మరుతి, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, రాయల్ రంగా పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ రాజనీతిజ్ఞుడు, భారత తొలి హోమ్ మంత్రి భారతదేశాన్ని ఉక్కు సంకల్పంతో ఐక్యం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జన్మదిన వారోత్సవాలలో భాగంగా దేశవ్యాప్తంగా సర్దార్ 150 ఐక్యత ర్యాలీ పాదయాత్రను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ 150 సంవత్సరాలు పూర్తి అయినా కూడా ఇప్పటికి భారతవని గుర్తు పెట్టుకుంటుంది అంటే అది కేవలం అయన మన భారతదేశానికి చేసిన కృషి సేవలు అని పేర్కొన్నారు.

అలాగే సర్దార్ పటేల్ 565 సంస్థానాలను ఏకం చేసి భారతదేశం ముక్కలు కాకుండా ఐక్యంగా ఉండేలా కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన సూచించిన అడుగుజాడలు మన యువత పయనించి వికసిత్ భారత్ ఆత్మ నిర్భర్ భారత్ కోసం కృషిచేసి 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా భారతదేశాన్ని నిలపడంలో ప్రతి ఒక్క యువత కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం భారతదేశం కనుక ప్రతి ఒక్క యువత దేశ భవిష్యత్తును తమ భుజస్కందాలపై వేసుకొని దేశభక్తి , మన దేశం మన గర్వం అనే నినాదంతో ప్రజలలో దేశభక్తిని కలిగించాలి అని పేర్కొన్నారు. తదుపరి జెండా ఊపి సర్దార్ 150 ఐక్యత ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో దాదాపు 1000మంది యువత పాల్గొని జాతీయ జెండాను చేత పట్టుకుని దేశ భక్తి నినాదాలతో బీరప్ప గుడి సర్కిల్ నుంచి ఆర్.టి.సి బస్టాండ్, మీదుగా ఎన్ టి ఆర్ సర్కిల్ వరకు ర్యాలీగా రావడం జరిగింది. ఎన్ టి ఆర్ సర్కిల్‌లో యువత అంతా కలిసి ఐక్యత ప్రతిజ్ఞ తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.కె.పి డిగ్రీ కాళాశాల ప్రిన్సిపాల్, లక్ష్మయ్య, ఆ నలుగురు సేవా సమితి సభ్యులు కేశవ, చక్రి, ప్రగతి పదం యూత్ అసోసియేషన్ సభ్యులు అంబరీష్ రాయల్ మరియు మహేంద్ర, గోపి, అధ్యాపకులు, మై భారత్ వాలంటీర్లు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, ఎన్ సి సి కాడేట్స్, విద్యార్థిని విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026 పై శిక్షణ





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం:** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026కు సంబంధించి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడిటిలు మరియు ఈఎస్‌ఏఎస్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు 27వ తేదీలోపు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడిటిలు, ఈఎస్‌ఏఎస్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించగా, ఈ విషయమై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడిటిలు మరియు ఈఎస్‌ఏఎస్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌ఓ ఏ.మలోల మాట్లాడుతూ 2002 ఓటర్ లిస్ట్ లో ఉన్న వారి జాబితా ప్రకారం 2025 ఓటర్ లిస్ట్ లో వారి వారసులతో మ్యాపింగ్ చేయమని, పెండింగ్ క్లయిమ్స్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడిటిలు, ఈఎస్‌ఏఎస్ లు వారి నియోజకవర్గాలలో బిఎల్‌ఓలు, సూపర్ వైజర్ లు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడిటిలు, ఈఎస్‌ఏఎస్ లు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in



## జాతీయ ప్రచారం జండర్ సమానత్వం

### - మండల సమాఖ్య స్థాయిలో ర్యాలీ, ప్రతజ్ఞ




**సింహాద్రిపురం – సూర్య వాస్తవం:** జాతీయ ప్రచారం జండర్ సమానత్వం కోసం జాతీయ స్థాయిలో మంగళవారం 25 వ తెది నుండి 24 /12/25 వరకు జరిగే కార్యక్రమాలను మండల సమాఖ్య స్థాయిలో చర్చించి ర్యాలీ నిర్వహించి ప్రతజ్ఞ చెయ్యడం జరిగిందని మండల సమైక్య సభ్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగ సమానత్వం కోసం జాతీయ ప్రచారాలు, ర్యాలీలు లింగ ఆధారిత హింసను అంతం చేయడానికి, మహిళల సాధికారతను ప్రోత్సహించడానికి, సమానత్వాన్ని ప్రోత్సహించడానికి జరుగుతాయి. లింగ సమానత్వంపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం 'నయీ చేతనా', 'అబ్ కోయి బహానా నహీ' వంటి జాతీయ ప్రచారాలను ప్రారంభించింది. లింగ సమానత్వానికి మద్దతుగా, భారతదేశంలో వివిధ సంస్థలు సైకిల్ ర్యాలీలు వంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు, విఓఏలు, అకౌంటెంట్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న శివాలయాన్ని సందర్శించిన ఎంపీ అవినాష్ రెడ్డి



**వేంపల్లి – సూర్య వాస్తవం:** వేంపల్లె మండలం నందిపల్లె గ్రామంలో పులివెందుల వేంపల్లి బైపాస్ ప్రక్కన నిర్మిస్తున్న శివాలయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మంగళవారం ఉదయం 9.30 గంటలకు సందర్శించారు. జరుగుతున్న పనులను పనులకు ఆయన ఖర్చును ఇతర వివరాలను ఆలయట్రస్టీ మారం శ్రీకాంత్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ సులోచన, ఇతర మహిళలతో కలిసి ఫోటోలు దిగారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి ఎంపీకి శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు ఈ కార్యక్రమానికి వేంపల్లి వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సింహాద్రిపురం సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడిగా పీజీ రాజగోపాల్ రెడ్డి



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం:** సింహాద్రిపురం సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడిగా నన్ను ఎన్నుకున్న సందర్భంగా, నాకు సంపూర్ణ మద్దతు మార్గదర్శకత్వం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కిలినా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. సింహాద్రిపురం మండల ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని గుర్తించి, ఈ బాధ్యతకు నన్ను నిలబెట్టి, ప్రోత్సహించిన పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జ్ బిటెక్ రవి కి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఈ బాధ్యతను స్వీకరించిన తరువాత, సొసైటీ అభివృద్ధి, రైతుల సంక్షేమం, సభ్యుల ప్రయోజనాల కోసం పారదర్శక వ్యవస్థను అమలు చేస్తూ నిరంతరం కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను.పి.జి. రాజగోపాల్ రెడ్డి తెలిపారు.

## తాగునీటి పైపులైన్ లీకేజీ



**వేంపల్లి – సూర్య వాస్తవం:** వేంపల్లి లోని మెయిన్ బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదురుగా జల జీవన్ పైపులు వేసేందుకు తీసిన గుంతల వలన త్రాగు నీటికి చెందిన పైపు లైన్ పగిలి మీరు వృధాగా పోవడంతో వృధాగా పోతున్న త్రాగునీటి పైప్లైన్ ను అధికారులు స్పందించి పంచాయతీ నీటి సరఫరా విభాగం సిబ్బందితో మరమ్మతులు చేయించి వృధాగా పోతున్న మంచి నీటిని ఆరికట్టాలని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు.

## సిమెంటు రోడ్ల నిర్మాణాలను

# ప్రారంభించిన మంత్రి ఎస్ సవితమ్మ

### - అశేష జన మధ్య పూలవర్షంతో మంత్రికి స్వాగత, ఘన సన్మానం





**గోరంట్ల – సూర్య వాస్తవం:** ఓటు వేసి గెలిపించిన ప్రజల రుణం తీసుకునే విధంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అభివృద్ధి పనులు చేసుకుంటూ పరుగులు తీస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్నారు.మారుమూల గ్రామం నుంచి పట్టణం వరకు అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి జరగాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యం మేరకు మంత్రి సవితమ్మ ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేయించు కుంటూ పట్టణాల్లో

మారుమూల వీధులు సైతం సిమెంట్ రోడ్లుగా మార్చే విధంగా నిధులు వెచ్చిస్తూ పనులు ప్రారంభిస్తూ తనదైన నాయకత్వాన్ని నిరూపించుకుంటూ ముందుకు సాగుతోంది మంత్రి సవితమ్మ, గోరంట్ల మండల కేంద్రంలోని గుమ్మయగారి పల్లి, పట్టణంలోని వినాయక నగర్ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు,

ఈ సందర్భంగా అశేష జనవాహిని మధ్య మంత్రి సవితమ్మ వినాయక నగర్ చేరుకోగానే స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణుల మధ్య టిడిపి నేత, కాంట్రాక్టర్ నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో మంత్రికి డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో ఘన స్వాగతం పలుకుతూ పూలమాలలు వేస్తూ శాలువాలు కప్పుతూ మంత్రిని సన్మానించారు.

గోరంట్ల పట్టణంలోని గుమ్మయ గారి పల్లిలో ఉపాధి హామీ పథకం కింద రూ, 13 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు జువెలరీ షాప్ యజమాని నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో వినాయక నగర్ లో 10 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ భూమి పూజ పనులకు మంత్రి సవితమ్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు, మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు పట్టణంలోని వినాయక నగర్లో ప్రారంభిస్తున్న సిమెంట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఎక్కడ తగ్గకుండా పాటిస్తామని దీర్ఘకాలిక రోడ్ల మన్నికే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని టిడిపి మండల నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్ తెలిపారు ,ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణ, స్టేట్ హస్త కళల డైరెక్టర్ పులేరు సోమశేఖర్, మాజీ సర్పంచ్ నరేష్, నిమ్మల విద్యాధరణి, మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్, మేజర్ పంచాయితీ సర్పంచ్ సరోజ నాగేనాయక్, నిమ్మల చంద్ర శేఖర్, గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, ఉమర్ ఖాన్, మేకల జయరాం, అచ్యుత్ నాయుడు, నబీ రసూల్, డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ నిడిమామిడప్ప, డైరెక్టర్ రవీంద్ర నాయక్, వానవోలు ఈశ్వర, శంకరప్ప, సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఖలీమ్ ఖాన్, గంగం పల్లి సుబహాన్ లతోపాటు ఎంపీడీవో కమల బాయి, తాసిల్దార్ మారుతి ప్రసాద్, డి.ఎస్.పి నరసింగప్ప, ఎస్ ఐ రామచంద్ర, ఈవో సుబ్రహ్మణ్యం, సంజయ్ కుమార్ నాయక్, లక్ష్మీ నరసులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను దైవంతో సమానంగా చూడాలి

### - నైతిక విలువలు తల్లిదండ్రులతోని అలవాటవుతాయి

### - మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం:** తల్లిదండ్రులను దైవంతో సమానంగా చూసినప్పుడే నైతిక విలువలు పిల్లలకు అలవాటైతాయని, తల్లికి చెప్పలేని పనిని పిల్లలు ఎప్పటికీ చేయకూడదని చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాన్ని బ్రాహ్మణ పల్లె జడ్పీ హైస్కూల్లో స్కూలు లో టీవీ ద్వారా వీక్షింపజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె వెంకట్రాంరెడ్డి పాల్గొని విద్యార్థి, విద్యార్థినులను ఉద్దేశించాయని మాట్లాడుతూ తల్లి ఎంత గొప్పదో తండ్రి అంత గొప్పవాడు. జీవితాంతం దైవంతో సమానంగా చూడాలి అని వారికి తెలిపారు. భగవంతుడే తండ్రి రూపంలో ఉన్నాడు. మన కంటికి కనపడని భగవంతుడు తండ్రి రూపంలో ఉన్నాడు అన్నారు. బిడ్డలు వృద్ధిలోకి రావాలని అహర్నిశలు కోరుకునే వ్యక్తి తండ్రి అన్నారు. పిల్లల కోసం ఏ త్యాగం చేయడానికైనా తండ్రి సిద్ధంగా ఉంటాడు అన్నారు. అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన అబ్రహం లింకన్, లతా మంగేష్కర్ తండ్రి గొప్పదనం గురించి ఎన్నో సందర్భాల్లో చెప్పారన్నారు. తండ్రి మాటను పెడచెవిన పెట్టవద్దు అనితల్లిదండ్రుల మాట వినడం నేర్చుకుంటే మీకు నైతిక విలువులు చాలా అలవాటవుతాయి అని తెలిపారు. అమ్మకు చెప్పలేని పని జీవితంలో ఎప్పుడు చేయకూడదు అని విద్యార్థులకు తెలిపారు.

## ఈ కొత్తపల్లి, ఎర్రబెల్లి తండాలలో రైతన్న మీ కోసం వారోత్సవాలు






**పులివెందుల – సూర్య వాస్తవం:** ఈ కొత్తపల్లి, ఎర్రబెల్లి తండాలలో రైతన్న మీకోసం వారోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి వి. చెన్నా రెడ్డి. మంగళవారం మండల వ్యవసాయ అధికారి వి చెన్నారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతన్న మీకోసం వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఈ కొత్తపల్లి, ఎర్రబెల్లి తండాలో పాల్గొన్నారు. ఈ కొత్తపల్లిలో మండల వ్యవసాయ అధికారి తో పాటు ఏ పిఎమ్ ఐపి – ఏపిడి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తూ ఉంది అని తెలిపారు. అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై మేలై న విత్తనాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్ కొరకు ఈనాం పద్ధతి, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతి ద్వారా వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలు పెంపు వంటి కార్యక్రమాలు అమలు చేస్తూ ఉంది. ఈ కార్యక్రమాలను రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతు సోదరులు అర్హులై ఉండి లబ్ధి పొందని రైతులు ఎవరైనా ఉంటే సంబంధిత వ్యవసాయ అసిస్టెంట్‌ను కలిసి నమోదు చేయించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవ్ రెడ్డి, శ్రీలత, ఇంతియాజ్ పాల్గొన్నారు.

# గ్రామ సేవకుల ఆగడాలకు అంతు లేదా

## - ఆ కార్యాలయంలో వీరు చెప్పినదే వేదం



**పామిడి - సూర్య వాస్తవం:** మండల రెవెన్యూ కార్యాలయంకు రైతులు మరియు నిరుపేదల నివాసస్థలాల పట్టాల కోసం వెళితే అక్కడ పనిచేస్తున్న కొందరు గ్రామ సేవకులు అడ్డుపడి సమస్యలు తెలపమని అడగడం తెలుసుకున్న తర్వాత ఇంత మొత్తం సొమ్ము ఖర్చు అవుతుందని. ఇది మాకు ఇస్తేనే పూర్తి చేస్తామని లేకుంటే లేదు అని అక్కడ ఆ కార్యాలయాన్ని శాసిస్తున్నారు .వారిని కాదని ఉన్నతాధికారుల దగ్గర ప్రజలు వెళ్లి సమస్యలు విన్నవించుకుంటూ ఉండగా గ్రామ సేవకులు వెళ్లి మధ్యలో దూరి లేనిపోని ఆరోపణాలు సృష్టిస్తూ సమస్యలు పరిష్కారం కాకుండా చేస్తున్నారు. అందుచేత గ్రామీణ ప్రజలు ఆ కార్యాలానికి వెళ్లాలంటే గడగడ లాడుతున్నారు.కావున ఇలాంటి ఆగడాలను అడ్డుకట్ట వేయకుంటే రెవెన్యూ పరువు పోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మండలంలో 5,6 మంది గ్రామ సేవకులు గ్రామాలలో సేవలు చేయకుండా అవినీతి సొమ్ముకై ఉదయం లేవగానే రెవెన్యూ కార్యాలయం ముంగిట రాబందుల్లా కాచుకొని ఉంటారని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. వీరు కార్యాలయంలోని ఉన్నత అధికారులని బ్లాక్మెయిల్ చేస్తూ బెదిరిస్తున్నారంటే వీరి ఆగడాలు ఎంత మేరకు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. గతంలో తాసిల్దార్లను నయానో భయానో బెదిరించి ప్రభుత్వ భూములను కుటుంబికుల పేరున పాసుబుక్కులు తెచ్చుకున్నారు. వాళ్ళు అడిగిన సొమ్ము ఇస్తే తక్షణమే నివాస స్థలాలు పట్టాల ఇస్తున్నారు.కావున వీరి పైన ఇప్పటికైనా జిల్లా మండల ఉన్న అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

## వృద్ధులకు, వికలాంగులకు

# పెద్దకొడుకుగా చంద్రబాబు అందిస్తున్న పెన్షన్లు

- అన్ని వర్గాల ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలతో లబ్ధి
- కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ బాను



**పెనుకొండ - సూర్య వాస్తవం:** వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు ఇంటికి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతినెల పెన్షన్లు అందిస్తూ ఎంతో వారి జీవనానికి కృషి చేస్తున్నారని రాష్ట్ర స్వచ్ఛ, ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్, పరిశీలకురాలు పర్వీన్ బాను తెలిపారు, ఈ సందర్భంగా పెనుకొండ నియోజకవర్గం లోని సోమందేపల్లి మండలం, తుంగోడు గ్రామ పంచాయతీ లో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి క్లస్టర్ ఇంచార్జ్, యూనిట్ ఇన్చార్జ్, కే ఎస్ ఎస్ సభ్యుల కు సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా సూపర్ సిక్స్ తో పాటు, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని, ప్రతి ఒక్కరు కులమతాలకు అతీతంగా పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు, సాధ్యం కానివి కూడా సాధ్యం చేసి చూపించారని బడుగు బలహీన వర్గాల కోసం చంద్రబాబు నాయుడు పరితపిస్తున్నారని ఆయనకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శైలజ, తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేష్, రామకృష్ణయ్య, సిద్ద లింగప్ప, శ్రీరాములు, సూర్యనారాయణ, మద్దిలేటితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధి కోసం

# సీఎం చంద్రబాబు పంచ సూత్రాలు

## - రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న బిటెక్ రవి




**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'రైతన్న మీకోసం' ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా, మంగళవారం సింహాద్రిపురం మండలంలోని హిమకుంట్ల గ్రామంలో నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి),అగ్రికల్చర్, హార్టికల్చర్, వ్యవసాయ అధికారులు, రైతులను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, అవసరాలు, సూచనలు తెలుసుకొని, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలను పులివెందుల టీడీపీ ఇంచార్జ బిటెక్ రవి, కడపజిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప శ్రీనివాసులు రెడ్డి వివరించారు. మాట్లాడుతూ రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని చేపట్టింద న్నారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధకశాఖ అసి స్టెంట్లు, సచివాలయ అధికారులు, గ్రామ అభ్యుదయ రైతు సహకార సంఘం సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో గ్రామ కమిటీగా మూడు టీమ్‌లుగా ఏర్పడుతాయన్నారు. ఒక్కొక్క టీమ్ రోజు 30 మంది రైతుల ఇళ్లకు వెళ్లి నీటి భద్రత, డిమాండ్, ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసిసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహించి యాక్షన ప్లాన గురించి అవగాహన కల్పిస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, తుంగభద్ర ప్రోజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగి రెడ్డి ,సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామసురా రెడ్డి, సింహాద్రిపురం సింగిల్ విండో సోసిటీ చైర్మన్ పీజీ గోపాల్ రెడ్డి, పుప్పాల శ్రీధర్ రెడ్డి,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## పంటలో పురుగుమందుల అధిక వినియోగం తగ్గింపుగా వాడాలి

### - జిల్లా వ్యవసాయ సంచాలకులు శివనారాయణ



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** పంటలో పురుగుమందుల అధిక వినియోగం తగ్గింపుగా వాడాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మద్దిరేవుల గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ సంచాలకుల శివనారాయణ సందర్శించి,ఆయన పంట పొలాలను పరిశీలించి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పలు సూచనలు, సలహాలు చేశారు. రబీ సీజన్‌లో పంటల ఎంపిక, విత్తనాల నాణ్యత, రోగ నిరోధక రకాల వినియోగం, నేల ఆరోగ్య కార్డుల ఆధారంగా ఎరువుల వాడకం చేయాలన్నారు.నానో ఎరువుల ప్రయోజనాలు మరియు స్ప్రే పద్ధతులు పై రైతులకు సూచించాలన్నారు. నీటి నిర్వహణ, మైక్రో ఇరిగేషన్ ప్రాముఖ్యతతో పాటు పంటలలో సమగ్ర కీటక నిర్వహణ పద్ధతులు పై అవగాహనా కల్పించాలన్నారు.ప్రభుత్వం చేపట్టిన శాసనబద్ధ కార్యక్రమాలు, రైతు భరోసా, పంట బీమా, రైతు భరోసా కేంద్రాల సేవల వినియోగం, వ్యవసాయ యంత్రాల సబ్సిడీ పథకాలు వంటి విషయాలను రైతులకు అయన వివరించారు. రైతులు పంటల నష్టం, ఎరువుల అందుబాటు, మార్కెట్ ధరలు మొదలైన సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు వివిధ పంటలపై సాంకేతిక పరిజ్ఞానం కల్పిస్తూ పోషకాహార పంటల ప్రోత్సాహకంపై కూడా విశేషంగా తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ సేవలను మరింత బలోపేతం చేయడానికి,ప్రతి రైతుకు సకాలంలో సమాచారం చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మోహన్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జి. రాజకుమారి, విహెచ్ఎ మల్లికార్జున, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## సిరిగారిపల్లి గ్రామస్తుల దీర్ఘకాల కోరికను నెరవేర్చిన మంత్రి

### - కదిరి, సిరిగారిపల్లి బస్సు సర్వీసు అధికారిక ప్రారంభం



**శ్రీ సత్యసాయి బ్యూరో - సూర్య వాస్తవం:** ముదిగుబ్బ మండలం ముదిగుబ్బ మండలంసిరిగారిపల్లి గ్రామ ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న ప్రజా రవాణా సౌకర్యం సాకారమైంది. కదిరి%-%సిరిగారిపల్లి మధ్య బస్సు సర్వీసును మంగళవారం ఉదయం అధికారికంగా ప్రారంభించారు. రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు ఇది ఎంతో ఆనందాన్ని కలిగించింది. కొద్ది రోజుల క్రితం రాకపోకల సమస్యలను సిరిగారిపల్లి గ్రామ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కి తెలియజేయగా, మంత్రి వెంటనే స్పందించి కదిరి ఆర్టీసీ డిపో అధికారులతో చర్చించి అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఆయన చురుకైన చర్యల ఫలితంగా మంగళవారం నుంచి ఈ కీలక బస్సు సర్వీసు ప్రారంభమైంది. ఈ బస్సు సర్వీసు మొదలవడం వల్ల, విద్యార్థులకు విద్యాసంస్థలకు వెళ్లడం సులభం, ఉద్యోగులకు ప్రతిరోజూ ప్రయాణంలో ఉపశమనం, వృద్ధులకు, మహిళలకు రాకపోకలలో భద్రత, సౌలభ్యం, గ్రామ అభివృద్ధికి ఒక ముఖ్యమైన మైలురాయి అవుతుందని స్థానికులు తెలిపారు. బస్సు మొదటిసారి ఊరిలోకి రాగానే గ్రామ ప్రజలు ఆనందంతో బస్సు డ్రైవర్, కండక్టర్‌లకు శాలువాలు కప్పి ఘన సన్మానం చేశారు. గ్రామ ప్రజల దీర్ఘకాల కలను నెరవేర్చినందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ కి ఈ కార్యక్రమంలో హాజరైన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854

Truth of News
సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in



## రౌండ్ టేబుల్ సమావేశానికి
# కడప ఏంపి అవినాష్ రెడ్డి కి ఆర్ఎస్ఎఫ్ ఆహ్వానం

- ఈ నెల 30 న కడప ప్రెస్ క్లబ్ లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశం
- కడప ఉక్కు పరిశ్రమ, మెడికల్ విద్యను ప్రయివేట్ చేయడం, కడప బెంగళూరు రైల్వేలైన్ పై సమావేశం
- రాయలసీమ అభివృద్ధి కోరే ప్రతి ఒక్కరికి ఆహ్వానం - ఆర్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్



**పులివెందుల – సూర్య వాస్తవం:** రాయలసీమ అభివృద్ధి కోసం జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి కడప ఎంపి అవినాష్ రెడ్డిని ఆహ్వానించినట్లు ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ అన్నారు. మంగళవారం పులివెందుల లోని ఆయన కార్యాలయం లో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం దశబ్దాకాలంగా నిర్మాణ దశలో ఆగిపోయిందని దాని నిర్మాణనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తెచ్చేందుకు, సాధించుకొనేదుకు ఈ సమావేశామని, నిర్మాణం పూర్తతే చదువుకున్న విద్యార్థులు బెంగళూరు చెన్నై హైదరాబాద్ కు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. అదేవిధంగా వైద్య విద్య ను ప్రయివేట్ పరం చేస్తూ పిపిపి విధానం తెచ్చారాని, దీని ద్వారా వైద్య విద్య ఖరీదై పేద, మధ్య తరగతి విద్యార్థులు చదవలేరని అన్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఈ కళాశాలల్లో వైద్య విద్య చదవ్వాల్సి వస్తుందన్నారు. అదేవిధంగా పేద మధ్యతరగతి ప్రజలు ఇక్కడ వైద్యం కొనుక్కోవాల్సిన పరిస్థితి అన్నారు... కడప నుండి బెంగళూరు కు రైల్వే లైన్ నిర్మాణం పై మాట్లాడగ, కర్ణాటక రాష్ట్రం లో భూసేకరణ లో పూర్తి నిర్లక్ష్యం వలన రైల్వే లైన్ ను కడప పులివెందుల పుట్టపర్తి రూట్ లోను, ముద్దనూరు, పులివెందుల, ముదిగుబ్బ పుట్టపర్తి రూట్లో బెంగళూరు కు చేయాదనికి ప్రతిపాదించారని చెప్పారు. అదేవిధంగా కడప రాయచోటి మదనపల్లి రైల్వే లైనకు భూసేకరణ జరుగుతుంది కాబట్టి ఆవిదంగా రైల్వే లైన్ కు కేంద్రం పై వత్తిడి చేయాలని ఆర్ఎస్ఎఫ్ ఓబులేసు యాదవ్ కోరారు.. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున యాదవ్, శివకేశవ, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు అండగా ఉంటా

- జగన్మోహన్ రెడ్డి రాకతో పులివెందుల జనసందోహం
- ప్రజా దర్బార్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం:** వైఎస్ జగన్ మోహన్రెడ్డి రాకతో పులివెందుల జనసందోహంగా మారింది. భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వాటిలో భాగంగా కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. వారి బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ.. 'నేనున్నాను' అంటూ భరోసాతో పాటు ధైర్యాన్ని కల్పించారు. పులివెందుల చుట్టుపక్కల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్.. వారి యోగక్షేమాలు తెలుసుకుని, వారి సమస్యలు ఓపిగ్గా విన్నారు. వారికి భరోసా కల్పించారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి మేలు ఒకటి కూడా జరగలేదని వచ్చిన వారంతా తమ గోడువెళ్ళబోసుకున్నారు. అన్ని వర్గాలకు వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చిన వైఎస్ జగన్, వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

**గోడు వెల్లబోసుకున్న రైతులు:** వరుస తుపాన్లు, వర్షాలతో తాము అల్లాడిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం నుంచి కనీస సాయం కూడా అందడం లేదని ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో తామంతా భరోసాగా బ్రతికామని, కానీ ఇప్పుడు వ్యవసాయం అంటేనే అన్నదాతలు భయపడే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వంపై రైతుల తరుపున పోరాడతామని.. వారికి అండగా ఉంటామని జగన్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ వైసిపి శ్రేణులు నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నా ప్రాణం ఉన్నంతవరకు వైసీపీలో ఉంటా

- టీడీపీ నుండి వైకాపా పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్ నాగరాజు
- పార్టీలో చేరిన నాగరాజుకు కండువా కప్పి ఆహ్వానించిన ఎంపీ



**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న మాజీ కౌన్సిలర్ కోమెర నాగరాజు, కుటుంబ సభ్యులు మంగళవారం జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ అవినాష్ రెడ్డి సమక్షంలో టిడిపి నుండి వైకాపా పార్టీ తీరు తప్పించుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చార్జిలు వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంతు రెడ్డి లు వైకాపా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ నేను మనస్ఫూపానికి గురై నా సొంత నిర్ణయంతోనే టిడిపిని వదిలి వైకాపా పార్టీలో చేరడం జరిగిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలలో వైకాపా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తా అన్నారు. ఇక నా కట్టే కాలే వరకు వైయస్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కడియాల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ
## రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు
**- డాక్టర్ కోలా ప్రసాద్**



**పులివెందుల – సూర్య వాస్తవం:** భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం నవంబర్ 26న మన దేశంలో సంవిధాన్ దివస్' అని కూడా పిలువబడే రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారని, ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, కెపి ఫౌండేషన్ అధినేత డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 నవంబర్ 26 న, భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని, ఇది 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చిందని ఆయన అన్నారు.రాజ్యాంగ దినోత్సవం అంటే నవంబర్ 26, 1949 న భారత రాజ్యాంగాన్ని ఆమోదించడాన్ని సూచిస్తుంది అన్నారు. ఇది భారతదేశం యొక్క ప్రజాస్వామ్య విలువలను, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వంపై అవగాహనను ప్రోత్సహిస్తుం దని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నుస్మరించుకుందామన్నారు.

## అంగరంగ వైభవంగా
## అంభ భవాని 24 వ వార్షికోత్సవము



**పామిడి – సూర్య వాస్తవం:** పామిడి పట్టణం లోని అంభ భవాని దేవాలయ 24వార్షికోత్సవము మంగళవారం అంగ రంగ వైభవంగ నిర్వహించారు. ఉదయం పురోహితుడు మహాదేవయ్య అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు లలిత సహస్ర నామవాళి కుంకుమ అర్చన గావించారు. అమ్మవారిని పల్లకి లో ఉంచి ప్రాకరోత్సవం మహిళలచే గావించారు. ఈ సేవ లో దీపాలు చేత బూని పాల్గొన్నారు. అమ్మవారికి పడి పూజ (మెట్ల పూజ )చేశారు. భావసారా అంభ భవాని సేవ దళ్ అధ్యక్షులు ముకుంద రావు పర్యవేక్షణ లో కార్యక్రమం నిర్వహించారు. భావసారా క్షత్రియ సమాజ్ సభ్యులు, భవాని మాల దారులు, కాలని వాసులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లి మండలం
## టీడీపీ అధ్యక్షునిగా యనమల మదన్ మోహన్



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షునిగా మంగళవారం రాయచోటిలోని ఎం యన్ ఎమ్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యనమల మదన్మోహన్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మరియు సహకరించిన మండల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి సోదరులు సహాయంతో ఇప్పటికే లక్కిరెడ్డిపల్లి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని లక్కిరెడ్డిపల్లి మండలంలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టి తీసుకు వస్తే మంత్రి సోదరులు సహాయంతో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. మండల తేదేపా అధ్యక్షులు గా తనపై బాధ్యత మరింతగా పెరిగిందని శక్తి వంచన లేకుండా మండలాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేటందుకు కృషి చేస్తామని తెలియజేశారు. లక్కడిపల్లి మండల అధ్యక్షునిగా ఎన్నికైన యనుమల మదనమోహన్ కు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు దృశ్యాలవలతో, గజమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో
## భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



**గోరంట్ల – సూర్య వాస్తవం:** గోరంట మండలంలోని పుట్టపర్తి రోడ్డులో గల గుంతపల్లి వద్ద కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం మొదలుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. హిందూపురం పట్టణంలోని రహమత్ పురం సర్కిల్ కు చెందిన ఇమ్రాన్, భాను దంపతులు పుట్టపర్తి నుండి హిందూపురం వెళుతుండగా గుంతపల్లి వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో ఇద్దరు కింద పడ్డారు దీంతో ఇమ్రాన్ చేయి విరిగిగాయపడడంతో వెంటనే భార్యాభర్తలను 108 వాహనంలో హిందూ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.